క్లుప్తంగా

తైక్వాండోలో సిద్ధార్థ విద్యార్థినుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల జరిగిన తైక్వాండో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ చూపి ఏడు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న సీహెచ్ ఉష, డి.మేఘన, ఎ.రిషితారెడ్డి, ఎస్.భవిష్య యోచిత, పి.సిరి, పి.బింధు గంగా భాగ్యశ్రీ, ఎం.శిరివల్లిలు ఆ పోటీల్లో సత్తా చాటినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా తైక్వాండోలో ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు అభినందించారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఉద్యోగులకు గృహోపకరణాల వితరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన శ్రీరామ్ ఫైనాన్స్ ఉద్యోగులకు ఆ సంస్థ గృహోపకరణాలు అందజేసింది. మంగళవారం ఫైనాన్స్ దక్షిణ ప్రాంతీయ విభాగం జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు చేతుల మీదుగా 70మంది ఉద్యోగులకు గృహోపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులే మూల స్తంభాలన్నారు. వరదల కారణంగా వారంతా ఇబ్బందులు పడ్డారని, వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో గృహోపకరణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరావు, నాగేంద్ర, మొగిలేశ్వరరావు, కె.వి.ఆర్.కె. ప్రసాద్, ఫణికుమార్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరితో కలిసి ఎమ్మెల్యే బొండా ఉమా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు వల్లభనేని సతీష్, తోట పాండు, కె.సత్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాండ్ హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి అమరావతి: నగరంలోని నోవాటెల్ వరుణ్ హోటల్‌లో బ్రాండ్ హైలైఫ్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. హైలైఫ్ ఎగ్జిబిషన్స్ ఎండీ, సీఈఓ అభి పి.డొమినిక్ మాట్లాడుతూ.. అతి పెద్ద ఎగ్జిబిషన్లలో హైలైఫ్ ఒకటన్నారు. వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్ అవసరాలతో పాటుగా లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నామన్నారు. ఫ్యాషన్ డిజైనర్ల నుంచి తాజా కలెక్షన్స్, ఫ్యాషన్ లేబుల్స్ సేకరించామన్నారు. ఫ్యాషన్ షాపింగ్, ఎక్స్‌క్లూజివ్ వెడ్డింగ్ షాపింగ్, బ్రైడల్ ఫ్యాషన్లు, జ్యువెలరీ, ఫ్యాషన్ – లైఫ్ స్టైల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బుధవారం కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

క్యూలో ఉన్న భక్తుల వద్దకే తాగునీటి సరఫరా

పటమట(విజయవాడతూర్పు): దసరా శరనవరాత్రి ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 25 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లో ఉన్న భక్తుల వద్దకే తాగునీటి పంపిణీ చేయాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం ఆయన వీఎంసీ శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు అవసరమైతే సిబ్బందిని పెంచి రెండు పాయింట్ల మధ్యలో ఉన్న భక్తులకు తాగునీటి లోపం లేకుండా వారి వద్దకే పంపిణీ చేయాలన్నారు. అలాగే అమ్మవారి భక్తులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల్లో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దసరా శరన్నవరాత్రుల్లో వచ్చే అమ్మవారి భక్తులకు అవసరమయ్యే తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూమ్స్ ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు.

శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- నగరంలో ఉత్సవ శోభ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో తొమ్మిదిరోజుల పాటు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలో దసరా ఉత్సవ శోభ సంతరించుకుంది.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఆలయం, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు అర్చనలు, హోమాలు సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన దసరా ఉత్సవాలు చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు తెలిపారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం

రామలింగేశ్వరపేటలో..

రామలింగేశ్వరపేటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అలంకారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు తెలిపారు.

- మధురానగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన తొమ్మిదిరోజుల పాటు పూజలు చేసేందుకు ప్రత్యేకంగా సెట్టింగ్ వేశారు.
- 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో దేవుని మండపం వద్ద , దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.
- మధురానగర్ లోని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయం లో ఈనెల 3వ తేదీ నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎన్యూమరేషన్‌లో ప్రభుత్వ వైఫల్యం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్యూమరేషన్ నుంచి వరద సాయం అందించడం వరకు కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వరద బాధితులను ఈ ప్రభుత్వం నిండా ముంచిందని.. ముఖ్యంగా సర్వే వివరాలు పొంతన లేనివిధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 97 శాతం మందికి నగదు బదిలీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా.. గ్రౌండ్ రిపోర్ట్ పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఎన్యూమరేషన్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాలతో సహా అధికారులకు సమర్పించినా ఫలితం లేదన్నారు. టీడీపీ నేతలు సచివాలయాల్లో కూర్చొని అర్హులను ఎంపిక చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22,185 మందికి ఇప్పటికీ కనీస సాయం అందలేదని చెప్పారు. పరిపాలన వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, అధికారుల్లో చిత్తశుద్ధి, పర్యవేక్షణ లోపించడంతో నెల రోజులు గడిచినా బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు.

కేంద్రానికి రూ.7 వేల కోట్ల నివేదిక ఎలా పంపారు

బుడమేరు వరద ముంపు నష్టాన్ని చూపి కేంద్రానికి రూ. 7 వేల కోట్ల నివేదిక పంపిన కూటమి ప్రభుత్వం.. చివరకు అరకొర సాయంగా వరద బాధితులకు రూ. 600 కోట్లు విదిల్చారని మల్లాది విష్ణు ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2.71 లక్షల కోట్లు నగదు బదిలీలు జరిగినా.. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది తలెత్తలేదని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం రూ. 600 కోట్లు అందించటంలో ఘోరంగా విఫలమైందని ఫలితంగా బాధితుల్లో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. వెహికల్ క్లెయిమ్స్ పరిస్థితి మరీ దారుణంగా ఉందని.. రూపాయి నష్టానికి పది పైసలు కూడా అందడం లేదన్నారు. ప్రభుత్వ అశ్రద్ధ కారణంగా కార్మికలోకం కుదేలైందన్నారు. సచివాలయాలకు వెళ్లి అనేక సార్లు దరఖాస్తు చేసుకుంటున్నా. చివరికి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి అర్జీలు అందజేసినా బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వ సాయం అందలేదన్న ఆవేదనతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలచివేసిందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వమే ఉంటే తమకీ పరిస్థితి వచ్చేది కాదని బాధితులు స్వయంగా చెబుతున్నారన్నారు. పరిహారం అందలేదని కలెక్టరేట్ వద్ద వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లలతో ఆందోళనకు దిగడం ఈ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందని చెప్పారు. గత ప్రభుత్వంలో పథకాల నుంచి పరిహారం వరకు ఇంటి వద్దే అందేవని.. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితులు నెలకొన్నాయని మల్లాది విష్ణు ఆరోపించారు. ఈ నెల 4 లోపు మళ్లీ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని.. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి.. నిధులు రాబట్టాలని తెలిపారు. లేనిపక్షంలో బాధితుల తరపున వైఎస్సార్ సీపీ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

3 నుంచి శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకూ శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్ చెప్పారు. ఈ సందర్భంగా కేబీఎన్ కళాశాల కమిటీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం వేదికగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చండీ సప్తశతి హోమంతో పాటుగా అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూల మంత్ర సంపుటితో చేయడం యాగం ప్రత్యేకత అన్నారు. కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ చండీహోమంతో పాటు నిత్యం రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మి, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు, కుంకుమార్చన జరుగుతాయన్నారు. తొమ్మిదో తేదీన విద్యార్థులతో మహాసరస్వతి పూజను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేదపఠనం , స్వామి వారి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విజయదశమి రోజున పూర్ణాహుతితో ఉత్సవాల పరిసమాప్తమవుతాయన్నారు. కోశాధికారి హరగోపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మేధోవికాసం జరగాలని కోరుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు దుగ్గి రామకిషోర్, వైస్‌ప్రిన్సిపాల్ కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తొమ్మండ్రు శేషయ్య తదితరులు

వృద్ధులను ఆదరించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వృద్ధులను ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో కాకుండా వారితో పాటే ఉంచుకుని, వారి పట్ల ప్రేమ ఆప్యాయతలు చూపాలని ఆమె సూచించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరప్పాడులోని వృద్ధాశ్రమాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య వివరాలు కేర్‌టేకర్స్‌ని అడిగి తెలుసుకున్నారు.

మేమేమి చేశాము పాపం..!

బుడమేరు ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఇంకా అందని ప్రభుత్వ సాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు కారణంగా సర్వస్వం కోల్పోయిన బాధితులకు.. ఇస్తామన్న ప్రభుత్వ సాయం ఇంకా అందకపోవడంతో సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, నందమూరినగర్, శాంతినగర్, పాయకాపురం, ఎల్‌బీఎస్‌నగర్, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, ఉడాకాలనీ, కండ్రిక పరిసర ప్రాంతాల్లోని ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. సచివాలయాలు, ఎమ్మెల్యే, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మాపై కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఏం సాయం రాదంటున్నారు

వరదల్లో ఇళ్లంతా మునిగిపోయి.. కట్టుబట్టలతో మిగిలామని.. ఇళ్లకొచ్చి ఫొటోలు, వీడియోలు తీసుకొని.. అన్ని రాసుకొని వెళ్లి తీరా మీ ఇల్లు మునగలేదు.. మీకు ఏ సాయం రాదని చెబుతున్నారంటూ వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు. మ్యాపింగ్‌కు ముంపునకు అసలు ఏమి సంబంధం ఉంది.. ఆధార్‌కార్డు మ్యాపింగ్ చూపించకపోతే మేం ఇక్కడ లేనట్లా.. మునగనట్లా. న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



న్యూఆర్ఆర్‌పేటలో వరద బాధితుల ఆందోళన

ఆదుకుంటారనుకుంటే ఆడుకుంటున్నారు..



న్యూరాజరాజేశ్వరీపేటలో గత పదేళ్ల నుంచి ఉంటున్నాను. వరదల్లో ఇల్లు మొత్తం మునిగిపోయి సర్వం కోల్పోయాను. ఒకరికి ముగ్గురు అధికారులు వచ్చి చూసి ఫొటోలు తీసి రాసుకెళ్లారు. తీరా ఇప్పుడు అసలు నువ్వు ఇక్కడ లేనే లేవు.. నీది కృష్ణలంకలో మ్యాపింగ్ చూపిస్తోందని చెప్పి నష్టపరిహారం ఇవ్వడం లేదు. మాకు న్యాయం జరిగే వరకూ మేం పోరాడటానికైనా సిద్ధంగా ఉన్నాం.

– గొలగాని రాము(న్యూఆర్ఆర్‌పేట)

కన్నీరే మిగుల్చుతున్నారు..

వరదల్లో ఇల్లుమొత్తం మునిగిపోయింది. నేను నా భర్త మా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మా ఇంటి పైనే వారం రోజులు తిండి తిప్పలు లేక తలదాచుకున్నాం. ఇంట్లో ఒక్క సామాను కూడా మిగలలేదు. అధికారులు వచ్చి అన్ని రాసుకొని వెళ్లారు. ఇప్పుడు మా పరిహారం కోసం వెళ్లి అడుగుతుంటే ఒక్కరు కూడా సమాధానం చెప్పడం లేదు. ఓ అధికారి అసలు మీ ఇల్లు ఇక్కడ లేనేలేదు.. ఎందుకు వస్తారంటూ మాతో పరిహాసమాడుతున్నారు. మేము తలదాచుకున్న గూడులోనే కాదు.. మా గుండెల్లో కూడా కన్నీరు మిగిల్చారు. అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

– వి.పద్మావతి, న్యూఆర్ఆర్‌పేట

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను వినియోగించుకోవాలని నాస్కామ్ ప్రతినిధి ప్రవీణ్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన నాస్కామ్, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఐటీ రంగంలో వస్తున్న మార్పులు పెంచుకోవాల్సిన నైపుణ్యాలు గురించి వివరించారు.

240 మందికి క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతరం నాస్కామ్, ఏపీఎస్‌సీహెచ్ఈ ఆధ్వర్యాన కళాశాలలో విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 240 మంది హాజరయ్యారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్‌లో రెండో దశ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జేకేసీ కో ఆర్డినేటర్ విజయ్ దీప్, సతీష్, శ్యాంసన్, డి.సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాస్కామ్ ప్రతినిధులు

ఉచిత ఇసుక హామీ ఏమైంది బాబూ..!

- లారీ రూ.20 వేలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.
- సీఎం చంద్రబాబు తీరుపై ఐఎఫ్‌టీయూ, బీసీడబ్ల్యూయు నాయకుల మండిపాటు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుకను ఉచితంగా ఇస్తామని.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును యధావిధిగా అమలుచేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ), బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(బీసీడబ్ల్యూయూ) సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక క్వారీలను తక్షణమే తెరిపించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును యథావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా 45 రకాల వృత్తుల్లో 35 లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత గత ప్రభుత్వంలో రూ.16 వేలు ఉన్న లారీ ఇసుక ధరను ఇప్పుడు రూ.20 నుంచి 25 వేలకు అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా రాష్ట్రంలో ఇసుక అందని ద్రాక్షగా మారిందని దుయ్యబట్టారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు నిలుపు చేయడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన 1214 సర్క్యులర్‌నువెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ప్రమాదాల బారిన పడిన కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే విడుదల చేయడంతో పాటు, ఇసుక రీచ్‌లను వెంటనే తెరిచి ఉచిత ఇసుక హామీని అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సింగ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ఏడుపిస్తున్నారు..!

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏమి వరదో.. ఏమో కానీ.. సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల ప్రజల జీవన చిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. గత ఐదేళ్లలో వార్డు సచివాలయాల పుణ్యమాఅంటూ అన్నీ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చారు. ఇప్పుడు జనం ఇప్పుడు కొద్దిపాటి వరద సహాయం తీసుకునేందుకు కూడా తీవ్ర అవస్థలు పడాల్సివస్తోంది. నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకునే దగ్గర నుంచి డబ్బులు పడ్డాయో లేదో చూసుకునే వరకూ కూడా రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడి 57 నుంచి 64 డివిజన్లలో నివసిస్తున్న ప్రజలు కొన్ని రోజులు నష్టపరిహారం కోసం నానాయాతన పడుతున్నారు. బ్యాంకుల వద్ద బాధితుల రద్దీ అధికంగా ఉండడంతో ఉదయం ఏడు గంటల నుంచే బ్యాంకుల వద్ద క్యూకట్టి గంటల కొద్ది పడిగాపులు కాస్తున్నారు.



పైపులరోడ్డు వద్ద ఉదయం ఏడు గంటలకే క్యూలో నిలబడ్డ వరద బాధితులు

ఏపీ న్యాయవాదుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్



విజయవాడస్పోర్ట్స్: ఏపీ న్యాయవాదుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా విజయవాడకు చెందిన దూబ క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఏపీ అడ్వొకేట్స్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఇటీవల జరిగిన జట్టు ఎంపిక పోటీల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రాంతికుమార్‌ను జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశామన్నారు. క్రాంతి సారథ్యంలోని జట్టు ఈ నెల ఆరు నుంచి 14వ తేదీ వరకు లక్నోలో జరిగే అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జట్టులో సతీష్, సురేష్‌కుమార్, చంద్రశేఖర రెడ్డి, అశోక్‌కుమార్, నవీన్, మద్దేస్, లక్ష్మీకాంత్, దేవానంద్, సుబ్రహ్మణ్యం, ముజీబ్, శ్రీకృష్ణ, విజయ్‌నాయుడు, వెంకటేష్, నిఖిల్‌కుమార్, జయప్రకాష్ చోటు దక్కించుకున్నారు.

వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అరుణ్‌కుమార్



దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి



దుస్తులు పంపిణీ చేస్తున్న తాడేపల్లి పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్ నేతలు

పాయకాపురం(విజయవాడరూరల్): వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పారిశ్రామికవేత్త చుక్కపల్లి అరుణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. కండ్రికలో ది పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం వరద బాధితులకు పారిశ్రామికవేత్త, సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఎంతోమంది పేదలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. తమవంతు బాధ్యతగా రూ.4.20 లక్షల విలువ చేసే కిట్లను 1,050 మందికి అందజేశామని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అలమండ ఎల్లారావు, కోశాధికారి జోత్స్న సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు మంగళవారం తాడేపల్లి పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్ వాసులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు ముళ్ళపూడి భగవాన్ మాట్లాడుతూ వరద ఉధృతికి ఇంట్లో వంట సామగ్రితో పాటు సర్వం కోల్పోయారన్నారు. తమ వంతు బాధ్యతగా అపార్ట్‌మెంట్ వాసులు అందరూ కలిసి రూ. 1.50 లక్షల విలువైన దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ బలరాం, ఉపాధ్యక్షులు జ్యోతిర్మయి, భానుమూర్తి, కేశవర్ధన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వరదతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. మధురానగర్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ ఆధ్వర్యాన 100 మంది వరద బాధితులకు దుస్తులు, చాపలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ జీఎల్‌టీ కో ఆర్డినేటర్ నెక్కంటి ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు కె. రవికుమార్, శ్రీనివాసరెడ్డి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నాస్తిక కేంద్రంలో ఏర్పాటైన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ఆలోచన ఉన్న వ్యక్తికి జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యువతే భవిష్యత్తు దేశ నిర్మాతలని, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ సమరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న భారత దేశాన్ని సాకారం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మునిసిపల్ కార్పొరేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ– ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేశారు.